ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారానికి కృషి



సుధీర్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న సెవన్ సీటర్ ఆటో డ్రైవర్లు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీ నగర్‌లోని సెవన్ సీటర్ ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎల్‌బీనగర్ సెవన్ సీటర్ ఆటో డ్రైవర్స్ సంక్షేమ సంఘ సభ్యులు బీఎన్ రెడ్డిలో జరిగిన ఓ సమావేశంలో సుధీర్‌రెడ్డిని కలిశారు. గతంలో సాగర్‌రింగ్ రోడ్డు నుంచి ఐఎస్‌సదన్ వరకు ఆటోలను నడిపేవారమని, ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు ఆర్‌టీసీ కాలనీ వరకు మాత్రమే అనుమతి ఇస్తుండటంతో ప్రయాణికులు తమ ఆటోలు ఎక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన సుధీర్‌రెడ్డి సంతోష్‌నగర్, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఏసీపీలను ఫోన్ ద్వారా సంప్రదించి సెవన్ సీటర్ ఆటో డ్రైవర్ల సమస్యను వివరించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, త్వరలో ఆటో డ్రైవర్లు, ట్రాఫిక్ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సంతు యాదవ్, జాన్‌పాషా, అజీమ్, మహేందర్, నర్సింహ, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్కుల పరిరక్షణకు చర్యలు



భీమానగర్‌లో పార్కు ప్రహరీ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ సుజాతా నాయక్ తదితరులు

హస్తినాపురం: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని, అందుకోసం డివిజన్‌లో ఉన్న పార్కులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని భీమానగర్ కాలనీలో రూ. 13 లక్షలతో నిర్మించే పార్కు ప్రహరీ నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. అనంతరం సుజాతా నాయక్ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస గుప్తా, ప్రతినిధులు నర్సింహారెడ్డి, నరేశ్, వెంకట్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద స్కూల్ పూర్వ విద్యార్థుల అలుమ్ని మీట్-2024



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



రిటైర్డ్ హెచ్‌ఎం లక్ష్మణ్‌రావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మలక్‌పేట: మూసారంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటనరీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల అలుమ్ని మీట్–2024 ఘనంగా జరిగింది. ఈ పాఠశాలలో చదువుకున్న అనేక మంది పూర్వ విద్యార్థులు ఉన్నత, అత్యున్నత స్థాయిల్లో ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో స్థిరపడ్డారు. వారంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి ఆకెళ్ల శ్రీదేవి, క్రిమినల్ కోర్టు జడ్జి ప్రేమావతి, జ్యుడీషియల్ న్యాయమూర్తి మల్లిక్ సుబ్రహ్మణ్యం, కన్స్యూమర్ కోర్టు రిజిస్ట్రార్ వీపీ రమణ మూర్తి సమావేశానికి హాజరై మాట్లాడారు. 1982 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి ఎర్రం సురేష్ వాట్సాప్ గ్రూప్ ద్వారా పూర్వ విద్యార్థులను ఒకరి ద్వారా ఒకరిని కలుపుకుని ఆరేళ్లుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా పాఠశాల భవన మరమ్మతులకు, నూతన భవన నిర్మాణానికి, ఇతర వసతులకు విరాళాల రూపంలో అందజేస్తున్నారు. 15 మంది రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆర్గనైజింగ్ టీమ్ ఎర్రం సురేష్, కామేశ్వర్‌రావు, రవీందర్, ఎన్, మధు, శ్రీరామ్, కవిత, మాలతి, మైథిలీ, రవి, పద్మసుందరి పాల్గొన్నారు.

ప్లాట్ల కబ్జాకు యత్నిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు

హయత్‌నగర్: 35 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న తమ ఇళ్ల స్థలాలను నకిలీ పత్రాలతో ఓ వ్యక్తి ఆక్రమించాలని చూస్తున్నాడని, అనుచరులతో వచ్చి ప్లాట్ల యజమానులను బెదిరిస్తున్నాడని రాఘవేంద్రా రెసిడెన్సీ ప్లాటు ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం రాత్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుర్నాథం తెలిపిన వివరాల ప్రకారం .. బాగ్ హయత్‌నగర్ స్వాతి రెసిడెన్సీ సమీపంలోని సర్వే నంబర్ 194లోని మూడు ఎకరాల భూమిలో గుమ్మి నర్సింహారెడ్డి అనే వ్యక్తి 42 ప్లాట్లు చేసి విక్రయించాడు. అయితే, కుటుంబరావు అనే వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి వాటిలో ఏడు ప్లాట్లను తనకు రిజిస్ట్రేషన్ చేయాలని 2022లో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. భూమి అసలు పట్టాదారులు మృతి చెందడంతో రిజిస్ట్రేషన్‌ను అధికారులు పెండింగ్‌లో పెట్టారు. నకిలీ పత్రాలతో అధికారులను తప్పుదోవ పట్టించిన అతను తాజాగా, ప్లాట్లను ఆక్రమించుకొనేందుకు తమపై దౌర్జన్యం చేస్తున్నాడని అసోసియేషన్ సభ్యులు ఆరోపిస్తున్నారు. సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమ ప్లాట్లను రక్షించాలని వారు పోలీసులను కోరారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం



ఎండీ సాబేర్, కృష్ణయ్యలను సన్మానిస్తున్న రఘుమారెడ్డి

మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి

మహేశ్వరం: పార్లమెంట్, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటుతుందని, పార్టీకి పూర్వవైభవం తెస్తామని మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోరుపోలు రఘుమారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామ కమిటీలను నియమించారు. ఘట్టుపల్లి అధ్యక్షుడిగా ఎండి సాబేర్, ఆకన్‌పల్లి అధ్యక్షుడిగా ముక్కెర కృష్ణయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, ఆకన్‌పల్లి మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గడ్డగూటి జంగయ్య, మంత్రి అంజయ్య, రాఘవేందర్‌రెడ్డి, యాదగిరి, విజయ్ నాయక్, గురుప్రీత్, రాములు, రమేష్, కుమార్ పలువురు పాల్గొన్నారు.

ఘట్టుపల్లి కాంగ్రెస్ కమిటీ..

గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎండి సాబేర్, సలహాదారుడిగా ఎర్ర జంగయ్య, మల్లప్ప, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, యాదగిరి, రమేష్, రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, చల్మారెడ్డి, అంజయ్య, కుమార్, బుచ్చప్ప, ఖాజాపాషా, ఎండి.మహ్మద్, రాఘవేందర్‌రెడ్డి, రమేష్, సంజీవ, జంగయ్యలను ఎన్నుకున్నారు.

ఆకన్‌పల్లి కాంగ్రెస్ కమిటీ..

కమిటీ అధ్యక్షుడిగా ముక్కెర కృష్ణయ్య, సలహాదారుడిగా బి నర్సింగ్ రావు, ఎ.వెంకట్‌రెడ్డి, శేఖర్, రమేష్, రాములు, కమలమ్మ, అజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై నిర్లక్ష్యం

చలాన్ల వసూళ్లకే పరిమితం

- హోటళ్లు, వైన్ షాపుల ముందు అక్రమ పార్కింగ్‌లు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారుల అవస్థలు



ఎల్‌బీనగర్‌లోని లక్కీ హోటల్ ముందు అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు

నాగోలు: ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాల్సిన పోలీసులు కేవలం చలాన్ల వసూళ్లకే పరిమితం అవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ పార్కింగ్‌ల వల్ల రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు అవస్థలు పడుతుంటే వెంటనే స్పందించాల్సిన ట్రాఫిక్ పోలీసులు చలాన్ల వసూళ్లలో బిజీగా ఉంటున్నారని వాహనదారులు వాపోతున్నారు. బడా హోటల్ వద్ద రోడ్లపై అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేయిస్తున్నా పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా వాహనదారులు ముందుకు కదిలే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారు.

- ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న స్వాగత్ హోటల్ నిర్వాహకులు అక్రమంగా రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేయిస్తున్నారు.
- అల్కాపురి చౌరస్తాలో ఉన్న లక్కీ హోటల్ ముందు ఉదయం, సాయంత్రం వేళల్లో ద్విచక్ర వాహనాలను, కార్లను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు.
- నాగోలు చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన దసరా హోటల్ వద్ద కూడా అదే పరిస్థితి ఉంటోంది. హోటళ్ల వద్ద అక్రమ పార్కింగ్‌ల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నా.. ట్రాఫిక్ పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- కొత్తపేట నుంచి ఎల్‌బీనగర్ వరకు సర్వీస్ రోడ్డు అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా మారిపోయింది.
- ప్రధాన రహదారులపై ఉన్న వైన్‌షాపుల వద్ద రాత్రి వేళల్లో రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే ఇతర వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు.
- సామాన్యులు చిన్నపాటి ట్రాఫిక్ నిబంధన పాటించకపోతే చలాన్ విధించే పోలీసులు హోటళ్ల వద్ద, వైన్‌షాపుల వద్ద రోడ్లపై వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు.
- ఇప్పటికైనా రాచకొండ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసులు ఉన్నతాధికారులు రోడ్లపై అక్రమ పార్కింగ్‌ల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నాగోలులోని దసరా హోటల్ వద్ద రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 23, వంకాయ 18, బెండ 50, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాబేజీ 21, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 21, దొండ 35–43, చిక్కుడు 28–40, గోకర 50, బీట్‌రూట్ 19, క్యాప్సికం 60, ఆలు 18–25, దోస 18, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 18, చామగడ్డ 57. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

వనస్థలిపురం: హస్తినాపురంలోని జీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం జరుగుతుందని పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ తెలిపారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో రాబోయే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలపై చర్చించనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, పలు విభాగాల కార్యవర్గ సభ్యులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు.

షబ్బీర్ అలీకి అభినందనలు



సైదాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ షేక్ అక్బర్, పలువురు పార్టీ నాయకులతో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

తండాల్లో మౌలిక వసతులు కల్పిస్తా

మహేశ్వరం: తండాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మండల ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కేసీ తండా శ్మశానవాటికలో బోరువేసి మోటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని గిరిజన తండాల్లో తాగునీటి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు వీధి దీపాల ఏర్పాటు చేయించి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తండాలు, గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటానన్నారు. మాజీ కోఆప్షన్ సభ్యులు అంధ్యా నాయక్, మాజీ ఎంపీటీసీ భద్రునాయక్, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, తండావాసులు గోపాల్ నాయక్, మున్న తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం



కుమ్మరి బస్తీ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న ప్రధాన సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో దశల వారీగా పరిష్కరించి ఇతర డివిజన్లకు ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన చంపాపేట డివిజన్ కుమ్మరి బస్తీలో రూ. 53 లక్షలతో తలపెట్టిన కాలనీ సంక్షేమ సంఘ భవన నిర్మాణ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... త్వరలో పలు కాలనీలలో పెండింగ్ పనులన్నింటినీ ప్రత్యేక నిధులతో పూర్తి చేస్తామన్నారు. కాలనీవాసులు రాజయ్య, నర్సింగరావు, సుదర్శన్, లక్ష్మమ్మ, అనిత, నాయకులు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, దశరథగౌడ్, యోగిరాజ్, అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల అందజేత



మహిళలకు కుట్టు మిషన్ అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: మహిళలు ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నాగోల్ డివిజన్‌కు చెందిన నిరుపేద మహిళలు ఐ.సరిత, యు.సరితలకు అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో శనివారం శ్రీనివాస్ గుప్తా చేతుల మీదుగా ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ జి.మంజుల, ఐవీఎఫ్ మహిళా సభ్యులు గీత, సీత, కాచం సుష్మా, జగతి ఉన్నారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

మన్సూరాబాద్: దేశవ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించే సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను శనివారం ఆటోనగర్‌లోని పారిశ్రామికవాడలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాలతో నిరుద్యోగం పెరిగిందని, శ్రామికుల వేతనాలు 20 శాతం తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ వెయ్యి రూపాయలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఆలేటి ఎల్లయ్య, వెంకటమ్మ, శ్రీదేవి, లక్ష్మమ్మ, విజయలక్ష్మి, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి రసాయన వ్యర్థాలు

- చేపలు మృత్యువాత
- ఆందోళనలో పెంపకందారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువులోకి కొందరు వ్యాపారులు రసాయన వ్యర్థాలు వదులుతుండడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. చెరువు ఒడ్డువైపు గతంలో నిర్మించిన మజీద్ పక్కనే కొందరు వ్యక్తులు చెరువును మట్టితో నింపి అక్రమంగా గత కొన్నాళ్లుగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వెలువడుతున్న వ్యర్థాలను నేరుగా చెరువులోకి వదులుతున్నారు. ఈ కారణంగా స్వచ్ఛమైన చెరువు నీటిపై రసాయన వ్యర్థాలు బుడగలుగా దర్శనమిస్తున్నాయి. రెండు మూడు కిలోల బరువు ఉన్న చేపలు ఈ రసాయన వ్యర్థాల కారణంగా మృతి చెందుతుండడంతో స్థానిక చేపల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇలాంటి రసాయనాలతో ఏకంగా నీరంతా నలుపుగా మారిన విషయం తెలిసిందే. చెరువును కబ్జా చేస్తూ....అక్రమ పరిశ్రమలను ఏర్పాటు చేస్తుండడం చెరువు ఉనికికే ప్రమాదకరంగా మారుతోందని గ్రామస్థులంటున్నారు. చెరువులో కొనసాగుతున్న ఈ కాలుష్య పరిశ్రమను వెంటనే మూసేయాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 వరకు తీగలగూడ, అఫ్జల్‌నగర్, బంజారా నగర్, రేస్‌కోర్స్ రోడ్, ఆర్టీఓ ఆఫీస్, బాలాజీ అపార్ట్స్ పరిసర ప్రాంతాలు, ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఓల్డ్ ఆర్టీఏ ఆఫీస్, ఫ్రెండ్స్ కాలనీ పరిసర ప్రాంతాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సలీంనగర్ మిల్క్ బూత్, రేస్‌కోర్స్, మసీద్, సిరిపురం కాలనీ, డెక్కన్ టవర్స్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

చంపాపేట: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని హరిహరపురం కాలనీలో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను సర్కిల్ ఏఈ నరేంద్రతేజతో కలిసి పరిశీలించారు. కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు శంకరయ్య, ఇతర కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్యారం టోర్నీని ప్రారంభిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్కేపురం డివిజన్ అలకాపురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎస్‌ఆర్ మీడియా వర్క్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్యారం టోర్నమెంట్ పోటీలను రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డితో కలిసి భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో పిట్ట హరినాథ్ రెడ్డి, అల్కాపూరి కాలనీ ప్రెసిడెంట్ వంశీ, కార్యదర్శి శ్రీనివాస్, ఎన్వీ సైదారావు, రాజు, రాజు నాయక్, దినేష్ భాస్కర్ నాయక్, ప్రేమ్ నాయక్, విజయ్, పెద్దవూర సైదులు, సంతోష్, మహేష్, కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పటిష్టతకు కృషి చేసిన వారికి తప్పక గుర్తింపు



వేణుగోపాల్‌రావును సన్మానిస్తున్న శ్రీనివాస్

సైదాబాద్: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను అధిష్టానం తప్పక గుర్తించి సరైన అవకాశాలు కల్పిస్తుందని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ సలహాదారునిగా ఇటీవల ఎన్నికైన అరికెల వేణుగోపాల్ రావును ఆయన పార్టీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన సైదాబాద్‌లో మాట్లాడుతూ, పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి అధికార పార్టీ చేసిన ప్రలోభాలకు లొంగకుండా పార్టీ కోసమే పనిచేసిన అందరికీ కాంగ్రెస్ నాయకత్వం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయి కాలనీ ఫేజ్-2 నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

హయత్‌నగర్: డివిజన్‌లోని సాయి కాలనీ ఫేజ్–2 కాలనీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా పెద్దగోని శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కేసరపు యాదయ్యాచారి, భీంరెడ్డి సుధీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లచ్చమల్ల వెంకన్న, సహాయ కార్యదర్శిగా బీవైఆర్ మూర్తి, కోశాధికారిగా గద్దె హరీష్, కార్యవర్గ సభ్యులుగా కంచర్ల శేఖర్‌రెడ్డి, కందిసేతు మాధవ్, నందివెలుగు వెంకట రామారావు, కుందేరు రాజారావు, బాసు పూర్ణచంద్రారావులను ఎన్నుకున్నారు. ఈ మేరకు కాలనీ సలహాదారులుగా ఎన్నికైన పిడుగు శ్రీనివాస్, గార్లపాటి రంగారెడ్డిలు వారితో పదవీ ప్రమాణం చేయించారు.

మెడికల్ అండ్ హెల్త్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గం



వనస్థలిపురం: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా దుర్గం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నూకం భిక్షపతి, అసోసియేట్ అధ్యక్షుడిగా డా.గంధం శాంతికుమార్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ రఫీయుద్దీన్, ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్, జాయింట్ సెక్రెటరీలుగా మరికొందరిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన సంవత్సర కేలండర్‌ను యూనియన్ అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.